క్లుప్తంగా

గవర్నర్ తమిళిసైకి ఘన స్వాగతం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌లోని కలాం గెస్ట్ హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాసరావు శనివారం ఘన స్వాగతం పలికారు. శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నగర పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన గవర్నర్‌కు రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాసరావు, వీసం రమణారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు.

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సమ్మేళనం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: కిట్స్ కళాశాలలో 1997లో బీటెక్ చదివిన పూర్వ విద్యార్థుల సిల్వర్‌జూబ్లీ సమ్మేళనాన్ని కళాశాల సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించారు. దేశ, విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి హాజరై నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కిట్స్ చాప్టర్ అధ్యక్షుడు పి.శ్రీధర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కోమల్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ ప్రభాకరాచారి, నిర్వహణ కమిటీ సభ్యుడు వెంకట్రామ్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్థివ దేహం అప్పగింత

ఎంజీఎం: వరంగల్ మట్టెవాడకు చెందిన భూపతి అన్నపూర్ణమ్మ(80) అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కాగా, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె పార్థివ దేహాన్ని ఆరెపల్లి సమీపంలోని ప్రతిమ కళాశాలకు శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా శరీర, నేత్ర, అవయవ దాతల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ పార్థివ దేహం వల్ల ఎంబీబీఎస్ విద్యార్థులు ప్రత్యక్షంగా వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మృతురాలి కుమార్తె భాగ్యలక్ష్మి, అల్లుడు యోగేంద్రనాథ్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మామునూరు: వరంగల్ – ఖమ్మం రహదారిపై మామునూరు శివారు చెరువు కట్ట సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కారు నుజ్జుఅయినప్పటికీ స్వల్ప గాయాలతో ముగ్గురు బయటపడినట్లు తెలిసింది. ఘటన స్థలానికి మామునూరు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం.

రైలులో నుంచి కిందపడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి – ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని ఇతర రాష్ట్రానికి చెందిన ఒక ప్రయాణికుడు ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి కిందపడి శనివారం అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి కోయంబత్తూర్ – సమస్తపూర్ వరకు జనరల్ రైలు టికెట్ తీసుకొని ప్రయాణిస్తూ ఉప్పల్ – హసన్‌పర్తి మధ్యలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడి వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



వెంకన్న (ఫైల్)

మడికొండ: అనారోగ్య సమస్యలతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వారాల వెంకన్న (80) శనివారం మృతి చెందారు. ఆయన మృతికి నాయకులు, గ్రామస్తులు నివాళులు అర్పించారు. పెండ్లి కృష్ణమూర్తి, బిల్లా రవీందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ అభివాదం

వరంగల్ అర్బన్: ప్రధాని మోదీ మామునూరు నుంచి నాయుడు పెట్రోల్ పంపు మీదుగా ఖమ్మం రోడ్డు, బట్టల బజార్ ఫ్లైఓవర్, పోపయ్యపేట చమన్, భద్రకాళి దేవాలయానికి వెళ్లారు. ఈక్రమంలో దారి వెంట 'నమో మోదీ.. మోదీ జిందాబాద్' అంటూ ప్రజలు నినాదాలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా జనానికి ప్రధాని మోదీ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

అసంపూర్తిగా రోడ్లు

- న్యూశాయంపేటలో అర్ధంతరంగా నిర్మించి వదిలేసిన సీసీ రోడ్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



అధ్వానంగా ఉన్న రోడ్డు



కంకర తేలిన రోడ్డు



ఓ వైపు సీసీ రోడ్డు, మరో వైపు మట్టి

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఏడాది క్రితం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి చేపట్టిన పనులు ఇప్పటివరకు కూడా పూర్తి కాలేదు. దాంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హనుమకొండ నుంచి కాజీపేట, వరంగల్‌కు వెళ్లేందుకు బైపాస్‌గా న్యూశాయంపేట జంక్షన్ దోహదపడుతోంది.

నిత్యం ప్రమాదాలు..

న్యూశాయంపేట జంక్షన్‌లోని అధ్వానమైన రోడ్లపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. సీసీ రోడ్డు నుంచి మట్టి రోడ్డును దాటే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో ఉన్న న్యూశాయంపేటలోని రోడ్లు దుమ్మురేపుతున్నాయి. అయినా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రోడ్డుపై కంకర, ఇసుక కుప్పలు



రోడ్ల నిర్మాణం పేరుతో పనులు ప్రారంభించి రోడ్డుపై కంకర, ఇసుక పోసి చేపట్టిన పనులను అర్ధంతరంగా వదిలేశారు. దాంతో ఏడాదిగా రోడ్డుపై వేసిన కంకర, ఇసుక కుప్పలతో ప్రయాణం కొనసాగించలేకపోతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తి రోడ్లను పూర్తి చేయాలి.

– రామిండ్ల బాబురావు, న్యూశాయంపేట

ప్రధాని మోదీకి నేతల ఘన స్వాగతం





ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఎర్ల అశోక్ రెడ్డి, వన్నాల వెంకటరమణ

హన్మకొండ: నగర పర్యటనకు శనివారం వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పలువురు బీజేపీ నేతలతో పాటు ఇతర పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. నరేంద్ర మోదీని బీజేపీ సీనియర్ నాయకుడు, పూర్వ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్టులో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.

ప్రధాని మోదీని కలిసిన వన్నాల వెంకటరమణ

ప్రధానమంత్రి మోదీని బీజేపీ సీనియర్ నాయకుడు, ప్రధాని స్వాగత కమిటీ సభ్యుడు వన్నాల వెంకటరమణ కలిశారు. మామునూరు ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిసిన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

మోదీని కలిసిన మంద కృష్ణమాదిగ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కలిశారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం వేదిక వెనుక వైపు ప్రధాని మోదీని మంద కృష్ణమాదిగ ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అలాగే, బహిరంగ సభ వేదిక వెనుక వైపు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థలంలో జనసంఘ్ నాయకులు, ప్రత్యేకంగా ఎంపిక చేసిన బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ నాయకులను ప్రధాని కలుసుకున్నారు.

పీఎం మోదీ సభకు తరలిన నాయకులు



కాజీపేట నుంచి సభకు తరలుతున్న నాయకులు



కాశిబుగ్గ నుంచి తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

కాజీపేట: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం జరిగిన పీఎం నరేంద్ర మోదీ బహిరంగ సభకు కాజీపేట నుంచి బీజేపీ కార్యకర్తలు తరలివెళ్లారు. 62వ డివిజన్ అధ్యక్షుడు భగవాన్‌దాస్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో పలువురు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో మేకల శ్రావణ్ కుమార్, పెసరు తిలక్, ఎండీ.చాంద్ పాషా, సుంచు వేణుకుమార్, కోవెల జీవన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ నుంచి..

కాశిబుగ్గ: కాశిబుగ్గ నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. బీజేపీ జిల్లా కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో 20వ డివిజన్ కాశిబుగ్గ నుంచి సుమారు 250 వాహనాల్లో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో బీజేపీ అధ్యక్షుడు సుతారి గోపి, తదితరులు ఉన్నారు.

హసన్‌పర్తి నుంచి..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, అరుణకుమారి ఆధ్వర్యంలో ఆయా డివిజన్ల నుంచి కార్యకర్తలు, నాయకులు పలు వాహనాల్లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చేరుకున్నారు.

మడికొండ నుంచి..

మడికొండ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయ సంకల్ప సభకు మడికొండ 64వ డివిజన్ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు కార్లలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో నాయకులు తొటిరెడ్డి రవీందర్‌రెడ్డి, భూక్య సునీల్, ఎలగొండ శివ, బైరి సతీష్, నరేందర్, అశోక్, తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ బహిరంగ సభ విజయవంతం



పద్మను మోదీకి పరిచయం చేస్తున్న జితేందర్ రెడ్డి

హన్మకొండ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న నగరంలోని విజయ సంకల్ప బహిరంగ సభ విజయవంతమైందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై ప్రధాని మోదీని ఆశీర్వదించారని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోదీకి రావు పద్మ పరిచయం

బహిరంగ సభ వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ వెనుక వరుసలో కూర్చున్న బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను ప్రధాని మోదీకి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పరిచయం చేశారు. ఈక్రమంలో ప్రధానికి రావు పద్మ నమస్కరిస్తూ తనకు తాను పరిచయం చేసుకున్నారు.

పలువురు నాయకుల అరెస్ట్.. విడుదల



కేయూ పోలీస్‌స్టేషన్‌లో పలు విద్యార్థి సంఘాల నాయకులు

కేయూ క్యాంపస్: ప్రధాని మోదీ నగర పర్యటన నేపథ్యంలో పలు విద్యార్థి సంఘాల నాయకులను, పలు పార్టీల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అలాగే, పలువురిని గృహ నిర్బంధం చేశారు. పలు విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు శనివారం అరెస్టు చేసి కేయూ పోలీస్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మంద నరేష్ (ఏబీఎస్ఎఫ్), రాకేష్ (ఎన్ఎస్‌యూఐ), ఆల్వాల కార్తీక్ (యూత్ కాంగ్రెస్), బొట్ల మనోహర్ (బీఎస్ఎఫ్), మంద శ్రీకాంత్ (ఎస్ఎఫ్ఐ)తో పాటు మాసాని ప్రదీప్, పవన్, సురేష్ తదితరులు ఉన్నారు. మోదీ పర్యటన అనంతరం వారిని విడుదల చేసినట్లు సమాచారం.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

మడికొండ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరంగల్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులను మడికొండ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, సందెల విజయ్‌కుమార్, వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, కుర్ల మోహన్, తొటిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, సత్యవరం మధుకర్, రాజు, కిరణ్, రాజ్, తదితరులు ఉన్నారు.

ప్రతిపక్ష నేతల హౌస్ అరెస్టు సిగ్గుచేటు

వరంగల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నగర పర్యటనకు వచ్చిన సందర్భంగా ప్రతిపక్ష పార్టీల నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం సిగ్గుచేటని వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఈమేరకు హనుమకొండలోని స్వగృహంలో ఆమెను శనివారం హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే, పీసీసీ సభ్యుడు మీసాల ప్రకాశ్, రావుల భూపాల్ రెడ్డి, పసునూరి అనిల్, కొమురయ్య యాదవ్, కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో మీసాల ప్రకాశ్



శ్రీనివాస్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

పలు పార్టీల నాయకుల అరెస్ట్

ఖిలా వరంగల్: మోదీ పర్యటన సందర్భంగా కాంగ్రెస్, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, సీపీఎం నాయకురాలు మాలోతు ప్రత్యూష తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల గృహ నిర్బంధం

హసన్‌పర్తి: ప్రధాని మోదీ నగర పర్యటన సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్‌ను శనివారం అదుపులోకి తీసుకుని హౌస్ అరెస్ట్ చేశారు.



మడికొండ పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



హనుమకొండలో గృహ నిర్బంధంలో ఎర్రబెల్లి స్వర్ణ

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

హన్మకొండ: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు రావాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల నుంచి నాయకత్వం ఎదగాలంటే అసెంబ్లీ, పార్లమెంటులలో బీసీలు అడుగు పెట్టాలన్నారు. అందుకు అనుకూలంగా చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కోసం చిన్న రాజ్యాంగ సవరణ జరగాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల మాదిరిగా చట్టసభల్లో బీసీ రేజర్వేషన్ల అమలుకు ప్రధాని మోదీ సహకరించాలని కోరారు. వరంగల్‌లోని టెక్స్‌టైల్స్ పార్కును ప్రధాని ప్రారంభించకపోవడాన్ని సురేష్ తప్పుబట్టారు. పీఎం మిత్ర పథకానికి అధికారిక అనుమతులివ్వని రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సాయిబాబా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ ఈదునూరి రాజమొగిలి, నాయకులు యుగేందర్ యాదవ్, శ్రీధర్ రాజు, రవీందర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో డీసీసీ భవన్

హన్మకొండ చౌరస్తా: భారత ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటన నేపథ్యంలో పోలీసులు హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాని రాకను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతారనే సమాచారంతో ముందుగానే డీసీసీ భవన్‌ను పోలీసులు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన గేటుకు తాళం వేసి మోదీ పర్యటన ముగిసే వరకు భారీ బందోబస్తు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులను సైతం భవన్‌లోకి అనుమతించలేదు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని సైతం నిర్వహించకుండా కాంగ్రెస్ నాయకులను నిలువరించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ జయంతిని నిర్వహించకుండా అడ్డుకోవడంపై డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు కాంగ్రెస్ అంటే ఎందుకు భయపడుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కడియం శ్రీహరి పుట్టినరోజు వేడుకలు



మల్లికాంబలోని పిల్లలతో కడియం శ్రీహరి



ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని సన్మానిస్తున్న సీఎం కేసీఆర్

హన్మకొండ అర్బన్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తన పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దివ్యాంగ పిల్లల మధ్య శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కేక్ కట్‌చేసి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించి తనే దగ్గరుండి వడ్డించారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన కడియం శ్రీహరి

హన్మకొండ: తన పుట్టిన రోజు సందర్భంగా సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కలిశారు. ఈమేరకు కడియంకు కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

అయోధ్యపురం గేట్ వద్ద ఇంజనీరింగ్ బ్లాక్

- ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభం



రైల్వేగేట్ వద్ద మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్ లోకోషెడ్ సమీపంలోని అయోధ్యపురం రైల్వేగేట్ నంబర్ 58 వద్ద శనివారం అధికారులు ఇంజనీరింగ్ బ్లాక్‌ను నిర్వహించారు. గేట్ వద్ద పట్టాల కింద పాత కంకరను బయటకు తీసి కొత్త కంకరతో ప్యాకింగ్ చేస్తున్నట్లు ఇంజనీరింగ్ సిబ్బంది తెలిపారు. అదేవిధంగా గేట్ పోల్స్‌కు పెయింటింగ్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్, రోడ్ మరమ్మతు పనులు సోమవారం వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో అయోధ్యపురం, మడికొండ గ్రామాల ప్రజలు రైల్వే గేట్‌లో నుంచి కాకుండా డీజిల్‌కాలనీ ప్రాంతంలోని అండర్‌బ్రిడ్జి నుంచి కడిపికొండ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

కాజీపేటలో రైల్వే జీఎం ఆకస్మిక తనిఖీ



సిగ్నల్స్ వ్యవస్థ పనితీరును పరిశీలిస్తున్న జీఎం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ ఏకే.గుప్తా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధాని మోదీ వ్యాగన్ షెడ్ శంకుస్థాపన కార్యక్రమానికి సికింద్రాబాద్ నుంచి రైల్వే జీఎం, డీఆర్ఎం, ఇతర రైల్వే విభాగాల అధికారులు ప్రత్యేక రైళ్లో కాజీపేట జంక్షన్‌కు వచ్చారు. రోడ్డు మార్గంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రదాని సభ కార్యక్రమానికి వెళ్లారు. ప్రధాని పర్యటన ముగింపు అనంతరం రైల్వే జీఎం, డీఆర్ఎం, ఇతర విభాగాల అధికారులు కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. కాగా.. రైల్వే జీఎం జైన్ ప్రత్యేక రైళ్లో సికింద్రాబాద్ వెళ్తారని అధికారులంతా అనుకున్నారు. కానీ.. కాజీపేట జంక్షన్‌లో ఆయన తనిఖీలు చేపట్టడంతో హైరానా పడ్డారు. ఇటీవల ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటన, శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా పగిడిపల్లి–బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఘటనల నేపథ్యంలో రైల్వే జీఎం కాజీపేట రైళ్లకు సిగ్నల్స్ రిలీజ్ చేసే రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం (ఆర్ఆర్ఐ) కార్యాలయంలోకి వెళ్లి సిగ్నల్స్ వ్యవస్థను తనిఖీ చేశారు. రైల్వే జీఎం లోకోపైలెట్ల కార్యాలయంలోకి వెళ్లి వారి విధుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం లోకోపైలెట్ల హాల్‌లో సుమారు 35 మంది లోకోపైలెట్లు, వారి కుటుంబ సభ్యులతో జీఎం సమావేశమయ్యారు. సుమారు 2 గంటల పాటు కాజీపేట జంక్షన్‌లో తనిఖీలు చేపట్టిన అనంతరం ప్రత్యేక రైళ్లో రైల్వే జీఎం సికింద్రాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. జీఎం వెంట సికింద్రాబాద్ ఏడీఆర్ఎం రాథోడ్, ఇతర విభాగాల సికింద్రాబాద్, కాజీపేట అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'వ్యాగన్‌షెడ్' వద్ద ఏర్పాట్లు నిల్

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురం శివారు పరిధిలో కేంద్రం ప్రతిష్టాత్మకంగా రూ.521 కోట్లతో నిర్మించతలపెట్టిన రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ భూమి వద్ద శనివారం ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి రిమోట్ ద్వారా వ్యాగన్ షెడ్‌కు శంకుస్థాపన చేస్తారని, దానికిముందు వ్యాగన్ ప్రతిపాదిత స్థలంలో రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు ఫౌండేషన్ స్టోన్ ఏర్పాటు చేస్తారని అధికారులు శుక్రవారం ప్రచారం చేశారు. అయితే, వ్యాగన్ స్థలం వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం, రైల్వే అధికారులు రాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా, పోలీసు బందోబస్తు మాత్రం అధికారులు ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు



ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రకటించారు. ఈమేరకు ప్రొసీడింగ్ పత్రాలను కాలనీవాసులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షుడు ముడుసు నర్సింహ, బండ్ల సురేందర్, వీరాచారి, సోమ కిష్టయ్య, సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, 14వ డివిజన్‌లోని ఏనుమాముల, సుందరయ్యనగర్‌కు చెందిన సాజీద, కొమ్మాలుకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.40వేల చెక్కులను లబ్దిదారులకు ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సులోచన పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ పునఃప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్, మేయర్

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలో పునరుద్ధరించబడిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను మేయర్ గుండు సుధారాణితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ శనివారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ అజీష్ అహ్మద్ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచుల మేరకు అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వివిధ రకాల వేడుకలకు, బడ్జెట్‌కు సరిపోయే బంగారం, వజ్రాలు, విలువైన రత్నాలతో కూడిన ఆభరణాలున్నాయని తెలిపారు. ప్రతి కొనుగోలుపై వెండి నాణాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దాస్యం రేవతి, షోరూం ప్రతినిధులు షరీజ్, షానిబ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కేంద్రం

కేయూ క్యాంపస్: దేశంలోని నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ కృష్ణ విమర్శించారు. ఈమేరకు నగర పర్యటనకు శనివారం వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ రాకను నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట ఆయా సంఘాల నాయకులు నల్ల బెలూన్లను గాల్లోకి ఎగురవేసి నిరసన తెలిపారు. ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రదీప్, ప్రణయ్, పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు. కాగా, నిరసన తెలుపుతుండగా పోలీసులు అక్కడికి చేరుకుని మంద శ్రీకాంత్, రాకేష్‌కృష్ణ, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్‌ను అరెస్టు చేసి కాకతీయ యూనివర్సిటీ పోలీస్టేషన్‌కు తరలించి అనంతరం విడిచిపెట్టారు.